అనుదినం జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
మంగళవారం 21 ఫిబ్రవరి 2023

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా, అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ నరేష్ కుమార్ అన్నారు. సోమవారం ఇందల్వాయి గ్రామపంచాయతీలో సోమవారం సదస్సు నిర్వహించారు. గ్రామంలో ముందస్తుగా సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ లింగంపల్లి రాజేందర్, ఎంపీటీసీ మారంపల్లి సుధాకర్, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ఎస్ఐ

సాగుచేసుకుంటున్న భూములకు పట్టాలివ్వాలి

ఆర్డీవో కార్యాలయం ఎదుట దళిత రైతుల నిరసన

నవతెలంగాణ-బోధన్

ప్రభుత్వ భూముల్లో ఏండ్లుగా సాగుచేసుకుంటున్న తమకు పట్టాలు ఇవ్వాలని దళిత రైతులు డిమాండ్ చేశారు. నిజామాబాద్ జిల్లా సాలూర మండలంలోని మంధర్న గ్రామానికి చెందిన సుమారు 50 దళిత కుటుంబాలు సోమవారం బోధన్ ఆర్డీవో కార్యాలయానికి తరలివచ్చి బైటాయించి ఆందోళన చేపట్టాయి.



వివరాలు మెయిన్‌లో..

కంటి వెలుగులో సర్కారు 'దగ్గరిచూపు'

- ఒకేరకమైన అద్దాల సరఫరా
- దూరపుచూపు సమస్యకు అద్దాల్లేవు
- ఆర్డర్ తీసుకుని చేయిస్తాం : డీఎంహెచ్ఓ సుదర్శనం

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

తెలంగాణలో అంధత్వ నిర్మూలనకు కంటి వెలుగు చేపడుతున్నామని సర్కారు చెబుతున్న మాటలకు.. క్షేత్రస్థాయిలో వాస్తవికతకు పొంతన కుదరడం లేదు. కంటి వెలుగులో సర్కారు కేవలం 'దగ్గరి చూపు' సమస్య ఉన్న రోగులపై మాత్రమే దృష్టి సారించింది. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా జరుగుతున్న కంటి వెలుగు కేంద్రాల్లోనూ కేవలం ఈ సమస్యకు సంబంధించిన రోగులకు మాత్రమే అద్దాలు సరఫరా చేస్తున్నారు. దూరపుచూపు సమస్య ఉన్నవారితో పాటు తలనొప్పి, ఇతర కంటి సమస్యలకు ఈ కేంద్రాల్లో చికిత్స లభించడం లేదు. వ్యయప్రయాసలకు ఓర్చి ఈ కేంద్రాలకు చేరుతున్న వృద్ధులకు నిరుత్సాహం తప్పడం లేదు. అయితే కంటి వెలుగులో దూరపుచూపు సమస్య ఉన్నవారికి కూడా అద్దాలు సరఫరా చేస్తామని డీఎంహెచ్ఓ సుదర్శనం తెలిపారు. కేవలం దగ్గరిచూపునకు మాత్రమే చికిత్స చేస్తున్నారన్నది అవాస్తవమని అన్నారు. దూరం చూపునకు సంబంధించి ఆర్డర్ తీసుకుని అద్దాలు చేయిస్తున్నామని, జిల్లాలో 1784 సరఫరా అయ్యాయని వివరించారు.



తెలంగాణ సర్కార్ రెండో విడత కంటి వెలుగు కార్యక్రమం జనవరి 18వ తేదీన ప్రారంభించింది. వంద రోజుల పని దినాల పాటు ఈ కార్యక్రమం కొనసాగనుంది. జిల్లాలో ఇప్పటి వరకు 2,04,550 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో దగ్గరిచూపునకు సంబంధించి 34,492 మందికి అద్దాలు సరఫరా చేశారు. అయితే దూరపుచూపు ఇబ్బందులు ఎదుర్కొంటున్న రోగులు మొత్తం 29,691 మందిని గుర్తించారు. కానీ కేవలం 1,419 మందికి మాత్రమే అద్దాలు సరఫరా చేశారు. మొత్తం 2,04,550 మందిలో 1,40,366 మందికి ఎలాంటి సమస్యలూ లేవని నిర్ధారించారు. ఇక 84 గ్రామపంచాయతీల్లో కంటి వెలుగు పూర్తవగా.. మరో 48 పంచాయతీల్లో కార్యక్రమం కొనసాగుతోంది. అయితే దగ్గరిచూపు సమస్య ఉన్నవారికి వెంటనే అద్దాలు సరఫరా జరుగుతుండగా.. దూరచూపు సమస్య ఉన్నవారికి ఆర్డర్ తీసుకుని అందజేస్తామని సంబంధిత సిబ్బంది చెబుతున్నారు. దీంతో దూరచూపు సమస్య ఉన్నవారికి అద్దాలు సరఫరా చేయకపోవడంతో నిరుత్సాహం చెందుతున్నారు. అయితే కొంతమంది రోగులు గత కంటి వెలుగు కార్యక్రమంలో పేరు నమోదు చేసుకున్నప్పటికీ.. ఇప్పటికీ సరఫరా జరగలేదని వాపోతున్నారు.

అన్ని రకాల అద్దాలు సరఫరా

డీఎంహెచ్ఓ సుదర్శనం

కంటి వెలుగు కార్యక్రమంలో అన్ని రకాల అద్దాలు సరఫరా చేస్తాం. కేవలం ఒకేరకమైన అద్దాలు మాత్రమే సరఫరా చేస్తారనడం అవాస్తవం. ప్రిస్కిప్షన్(దూరచూపు) అద్దాలు ఆర్డర్ చేస్తాం. నేరుగా రోగులకు అందజేసేందుకు వారి అడ్రస్, ఫోన్ నెంబర్లు తీసుకుంటున్నాం. గత కంటి వెలుగు కార్యక్రమంలోనూ దూరచూపు అద్దాలు వచ్చాయి. కానీ చాలా మంది తప్పుడు నెంబర్లు, అడ్రసులు ఇవ్వడం వల్ల సరఫరా చేయలేకపోయాం.



వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు, నాయకులు

మధ్యాహ్న భోజనంలో కోడిగుడ్డు అందించలేం

- కార్మికులపై అధికారుల, ప్రజాప్రతినిధుల వేధింపులు మానాలి
- ఎంఈవోకు కార్మికుల వినతి

నవతెలంగాణ-ఎడపల్లి

స్కూళ్లల్లో మధ్యాహ్న భోజనంతో పాటు కోడిగుడ్డును అందించలేమని మధ్యాహ్న భోజన కార్మికులు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గుడ్డుకు రూ.5 మాత్రమే చెల్లిస్తుందని, కానీ బహిరంగ మార్కెట్‌లో గుడ్డు 6.50 రూపాయల నుంచి 7 రూపాయలకు పలుకుతోందని దీంతో కార్మికులు తమ సొంత డబ్బులు వెచ్చించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మిక సంఘం (సీఐటీయూ) ఆధ్వర్యంలో ఎడపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి వినతిపత్రం అందజేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కోడిగుడ్డు కూడా ప్రభుత్వమే ఏడు రూపాయల ధరను చెల్లించాలని కార్మికులు డిమాండ్ చేశారు. కార్మికలకు నవంబర్ నుండి ప్రస్తుతం వరకు బకాయి వేతనాలతో పాటు బిల్లులు కూడా మంజూరు చేయకపోవడం ఆర్థిక ఇబ్బందులు పడుతున్నట్టు తెలిపారు. అనేక కష్టాలనష్టాలకోర్చి పిల్లలకు భోజనం పెడుతుంటే అధికారులు, ప్రజాప్రతినిధుల నుంచి వేధింపులు పెరుగుతున్నాయని అన్నారు. చేతులు, కాళ్ల కాల్చుకుంటూ వంట చేస్తున్నామని, సకాలంలో బిల్లులు రాకున్నా.. వేతనాలు ఇవ్వకున్నా అప్పులు తెచ్చి వంట చేస్తున్నామనే విషయాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు గమనంలో ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన సంఘం జిల్లా అధ్యక్షురాలు చామంతి లక్ష్మి, జిల్లా ప్రధాన కార్యదర్శి చక్రపాణి, మండల అధ్యక్షురాలు దేరాడి లక్ష్మి, బట్టు సాయమ్మ, నెయ్యి సాయమ్మ, ఆయా గ్రామాల మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్పోరేషన్ బడ్జెట్ ఆమోదం

నవతెలంగాణ-కంఠేశ్వర్



మాట్లాడుతున్న మేయర్

2023-2024 ఆర్థిక సంవత్స రానికి సంబంధించి నిజామాబాద్ నగరపాలక సంస్థ ప్రతిపాదించిన బడ్జెట్ ఆమోదం పొందింది. సోమవారం స్థానిక న్యూ అంబెద్కర్ భవన్‌లో నగర మేయర్ దండు నీతూకిరణ్ అధ్యక్షతన నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో నిజామాబాద్ అర్బన్ శాసనసభ్యులు బిగాల గణేష్ గుప్తా, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా పాల్గొన్నారు. 2023-2024 సంవత్సరానికి సంబంధించిన ప్రతిపాదిత బడ్జెట్ తో పాటు, 2022-2023 సవరించిన అంచనా బడ్జెట్ ను సమావేశంలో ప్రవేశపెట్టగా, కౌన్సిల్ సభ్యులు ఆమోదించారు. 2022 ఏప్రిల్ 01 నాటికి ప్రారంభ నిల్వ రూ. 82.57 కోట్లు, 2022 - 2023 సవరణ అంచనా సాధారణ ఆదాయం రూ.87.77 కోట్లు లక్షలు కలుపుకుని మొత్తం రూ. 170.34 కోట్లుగా పేర్కొన్నారు. 2023 - 2024లో అంచనా సాధారణ ఆదాయం రూ.173,03 కోట్లుగా బడ్జెట్‌లో పొందుపర్చారు. వ్యయం రూ. 90.07 కోట్లుగా అంచనా వేస్తూ, 2024 మార్చి నెలాఖరు నాటికి రూ. 82.96 కోట్లు మిగులు బడ్జెట్‌గా ఉంటుందని అంచనా వేశారు. అదే విధంగా 2023-2024లో అంచనా క్యాపిటల్ ఆదాయం రూ. 171.27 కోట్లు, వ్యయం రూ. 170,59 కోట్లుగా, డిపాజిట్లు రూ. 11.20 కోట్లుగా, అప్పులు రూ. 11.00 కోట్లుగా బడ్జెట్‌లో పేర్కొన్నారు. ఈ మేరకు సమావేశంలో బడ్జెట్ ఆమోదం పొందిందని మేయర్ నీతూకిరణ్ ప్రకటించారు. ఈ సందర్భంగా తమతమ డివిజన్లలో నెలకొన్న సమస్యలను కార్పొరేటర్లు ప్రస్తావించగా, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా, మేయర్ నీతూకిరణ్ సానుకూలంగా స్పందించారు. ఈ సమావేశంలో ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, నగర పాలక సంస్థకు చెందిన వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఎర్రజొన్న రైతులకు ఇక్కట్లు పెట్టొద్దు

- వ్యాపారులతో కలెక్టర్ సమావేశం
- మార్కెట్ ధర చెల్లించాలని సూచన

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ఎర్రజొన్న కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మార్కెట్ రేటుకు అనుగుణంగా ధరను చెల్లిస్తూ పంటను సేకరించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంత సీడ్ కంపెనీల ప్రతినిధులకు సూచించారు. ఎర్రజొన్న దిగుబడులు చేతికందుతున్న నేపథ్యంలో, కలెక్టర్ సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని తన చాంబర్లో విత్తన వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. రైతులతో కుదుర్చుకున్న బైబ్యాక్ ఒప్పందానికి కట్టుబడి కొనుగోళ్లు జరగాలన్నారు. ఎర్రజొన్న సాగుకు అవసరమైన విత్తనాల సరఫరా, రైతులతో ఒప్పందం కుదుర్చుకునే విధానం, విత్తనాల వెరైటీలు తదితర అంశాల గురించి వ్యాపారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతుల నుండి సేకరించిన ఎర్రజొన్న పంటను ఢిల్లీ, పంజాబ్, హర్యానా, మహారాష్ట్ర, గుజరాత్, రాజస్థాన్ తదితర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తామని, అక్కడ ఎర్రజొన్నను పశువులకు దాణాగా వినియోగిస్తారని సీడ్ కంపెనీల ప్రతినిధులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. గతేడాది సాగు చేసిన ఎర్రజొన్న పంటను పలువురు రైతులు కోల్డ్ స్టోరేజ్‌లలో నిలువ చేసుకుని ఈ ఏడాది విక్రయించారని తెలిపారు. అయినప్పటికీ, ఈసారి అత్యధిక మంది మొక్కజొన్న పంట వైపు మొగ్గు చూపడంతో ఎర్రజొన్న సాగు విస్తీర్ణం తగ్గిందని అన్నారు. ఫలితంగా ప్రస్తుతం మార్కెట్లో ఎర్రజొన్న పంటకు ఆశించిన రీతిలోనే మంచి డిమాండ్ ఉందని తెలిపారు. రైతులతో కుదుర్చుకున్న ఒప్పందానికి మించి ఎర్రజొన్నకు ఎక్కువ మొత్తంలో ధర పలుకుతోందని అన్నారు. ఎలాంటి సమస్యలకు తావులేకుండా కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బి.చంద్రశేఖర్, జిల్లా వ్యవసాయ అధికారి తిరుమల ప్రసాద్, విత్తన కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.



విత్తన వ్యాపారులతో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రాణం మీదకు తెచ్చిన పెత్తనం

నవతెలంగాణ-నందిపేట్

తన పంట చెనులో గోర్లు మేశాయాని ఓ వ్యక్తి మందలించడంతో ఓ యువకుడు గడ్డి మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని వెల్మల్‌లో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వెల్మల్ గ్రామానికి చెందిన సదనంద్ అనే యువకుడు రోజు వారిగా తనకున్న గోర్లను మేపడానికి ఉదయం ఊరి శివారులోకి బయలుదేరాడు. ఐతే ఓ వ్యక్తి చెనులో గోర్లు మేయడంతో ఆ వ్యక్తి మీ వర్గానికి మా వర్గానికి గత కొన్ని నెలలుగా విభేదాలు ఉన్నాయని ఇక్కడ ఎందుకు గోర్లను మేపుతారని మీ పంటపొలాల్లో మేపుకోవాలని దుర్భాషలాడాడు. తండ్రి కూడా ఊరి విషయాల్లో బాగా పెత్తనం చేస్తున్నాడని మందలించాడు. దీంతో ఇరువురి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అక్కడ నుంచి సదానంద్ బయలుదేరి ఇంటికి వచ్చి అదే రోజు మద్యం సేవించి తన తండ్రితో గోడవపడ్డాడు. ఇంటికి వచ్చిన తర్వాత తన కొడుకు గడ్డి మందు తాగడని తెలియడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం జిల్లాలో ఓ ప్రవేటు ఆసుపత్రిలో తరలించారు. ప్రస్తుతం బాధితుడు చికిత్స పొందుతున్నాడు.

చెట్టును ఢీకొన్ని స్కూల్ బస్సు

- పలువురి విద్యార్థులకు స్వల్ప గాయాలు..
- తప్పిన పెను ప్రమాదం



చెట్టును ఢీకొన్న స్కూల్ బస్సు



నవతెలంగాణ-కామారెడ్డి టౌన్

స్కూల్ బస్సు అదుపుతప్పి చెట్టును ఢీకొన్న ఘటన కామారెడ్డి మండలం లింగాయిపల్లి గ్రామ సమీపంలో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. ప్రమాద సమయంలో బస్సులో 50 మంది విద్యార్థులుండగా.. ఐదుగురికి స్వల్ప గాయాలు కావడంతో పెనుప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళ్తే.. కామారెడ్డిలోని గౌతమ్ మోడల్ స్కూల్ బస్సు విద్యార్థులను తీసుకొని లింగయ్యపల్లి, రాజంపేట్ తదితర గ్రామాలకు వెళ్తుండగా.. ప్రమాదవశాత్తు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. దీంతో ఒక్కసారిగా విద్యార్థులకు భయాందోళనకు గురైయ్యారు. ప్రమాదసమయంలో బస్సులో సుమారు 50 మంది విద్యార్థులున్నారు. కాగా ఐదుగురికి స్వల్ప గాయాలు కావడంతో పెను ప్రమాదం తప్పినట్టయింది. ప్రమాదం జరిగిన వెంటనే విద్యార్థులకు ఎలాంటి ఎలాంటి ప్రమాదం జరగలేదని సమాచారం ఇవ్వడంతో తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని తెలిపారు. కాగా బస్సు డ్రైవర్‌కు మూర్చవచ్చినట్టు స్థానికులు తెలిపారు

మల్టీపర్పస్ పేరుతో జీపీ కార్మికుల శ్రమ దోపిడీ

- పంచాయతీ కార్మికులకు పనికి తగ్గ వేతనం చెల్లించాలి
- పనిభారం తగ్గించి ఉద్యోగ భద్రత, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలి
- జీపీ కార్మికుల పాదయాత్రకు సంఘీభావంగా ఇరు జిల్లాల్లో సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికుల ర్యాలీ

నవతెలంగాణ-కంఠేశ్వర్/కామారెడ్డిటౌన్

రాష్ట్ర ప్రభుత్వం మల్టీపర్పస్ పేరుతో గ్రామపంచాయతీ కార్మికుల శ్రమదోపిడీకి పాల్పడుతోందని సీఐటీయూ నాయకులు విమర్శించారు. వారితో గొడ్డుచాకిరి చేయించుకుంటూ మూడునాలుగు వేల రూపాయల వేతనం మాత్రమే చెల్లిస్తున్నారని దుయ్యబట్టారు. మల్టీపర్పస్ విధానం రద్దు చేసి, జీపీ కార్మికులపై పని భారం తగ్గించాలని, పంచాయతీ సిబ్బందిలో అర్హులను గుర్తించి ప్రమోషన్‌లు కల్పించాలని, పనికి తగ్గ కనీస వేతనం అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించి పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ఫిబ్రవరి 12 నుండి చేపట్టిన పాదయాత్రకు సంఘీభావంగా నిజామాబాద్, కామారెడ్డిలో జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం పాదయాత్ర చేపట్టారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియం నుంచి కొత్త కలెక్టర్ కార్యాలయం వరకు గ్రామపంచాయతీ సిబ్బంది పాదయాత్ర చేపట్టారు. కామారెడ్డిలో గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో మున్సిపల్ ఆఫీస్ నుండి కలెక్టర్ ఆఫీస్ వరకు పాదయాత్ర చేపట్టి డీపీవో శ్రీనివాస్‌రావుకు వినతిపత్రం అందజేశారు.



కామారెడ్డిలో పాదయాత్ర చేపట్టి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న జీపీ కార్మికులు, నాయకులు

నిజామాబాద్‌లో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్, కామారెడ్డిలో పంచాయతీ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు వెంకట్‌గౌడ్ మాట్లాడారు. గ్రామ పంచాయతీ కార్మికులు పారిశుద్ధ్యం, వీధి దీపాల నిర్వహణ, వాటర్ సప్లై, కారోబార్, బిల్ కలెక్టర్లు, ఆఫీస్ నిర్వహణ తదితర పనులు నిర్వహిస్తున్నారని తెలిపారు. క్షేత్రస్థాయిలో గ్రామ అవసరాల ప్రాతిపదిక మీద పంచాయితీ పాలకవర్గం మరికొంత కార్మికులను నియమించుకున్నది. ప్రస్తుతం పనిచేస్తున్న వారందరికీ పెంచిన వేతనాలు ఇవ్వకపోవడంతో కొందరికి మాత్రమే వస్తున్న వేతనాలను అందరూ పంచుకుంటున్నారు. దీంతో అత్యధిక మంది కార్మికులకు రూ.3500ల నుండి రూ. 4500ల వరకు మాత్రమే వస్తున్నాయి. వేతనాలు పెంచామనే సాకుతో వివిధ కేటగిరీలను రద్దు చేసి మల్టీపర్పస్ వర్కర్ విధానం తీసుకొస్తూ ప్రభుత్వం 51 జీవోను తెచ్చింది. దీంతో కార్మికులకు పని భారం పెరిగింది. కారోబార్లో పారిశుద్ధ్యం, వీధి దీపాల నిర్వహణ, ట్రాక్టర్స్ డ్రైవర్, చివరికి ప్రజా ప్రతినిధుల ఇండ్లలో వ్యక్తిగత పనులను కూడా చేయించుకుంటున్నారు. వేతనాలు కూడా 3 నెలల వరకు బకాయిలుగా ఉన్నాయి. దీంతో కార్మికులు అప్పులపాలై ఇబ్బందులు వస్తున్నాయి. జీఓ నెం. 60 గ్రామపంచాయతీ కార్మికులకు కూడా వర్తింపజేస్తూ, పారిశుద్ధ్య కార్మికులకు రూ.15600లు, కారోబార్, బిల్ కలెక్టర్లు, ట్రాక్టర్ డ్రైవర్లు, వీధి దీపాల నిర్వహణ, వాటర్ సప్లై కార్మికులకు రూ.19500లు, కంప్యూటర్ ఆపరేటర్లు, టెక్నికల్ విభాగంలో పనిచేసే సిబ్బందికి రూ.22750ల వేతనం చెల్లించాలని, యాక్ట్ 2/94ను రద్దు చేసి పంచాయితీ సిబ్బంది నందరినీ పర్మినెంట్ చేయాలని, కారోబార్, బిల్ కలెక్టర్లకు స్పెషల్ స్టేటస్ కల్పించి వారిని అసిస్టెంట్ పంచాయితీ కార్యదర్శులుగా నియమించాలి. జీఓ నంబర్ 61 ని సవరించాలని, మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, పిఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా సౌకర్యం అమలు చేయాలని' డిమాండ్ చేశారు.

నిజామాబాద్‌లో పాదయాత్రకు సంఘీభావంగా ఐద్వా జిల్లా కార్యదర్శి సబ్బని లత, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి విగ్నేష్, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి గంగాధర్, గ్రామపంచాయతీ యూనియన్ జిల్లా అధ్యక్షులు రాజేష్, కరోబార్ యూనియన్ నాయకులు సాగర్, రాజేశ్వరి నందు పసియుద్దిన్ సాయిలు గంగారం బాలు నాగేష్ అయ్య బ్, గ్రామపంచాయతీ కార్మికులు కారోబార్లు బిల్ కలెక్టర్ల గ్రామ పంచాయితీ సిబ్బంది పాదయాత్రలో పాల్గొన్నారు.

కామారెడ్డిలో సీఐటీయూ జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్, సంఘం జిల్లా అధ్యక్షుడు బాలనర్సు, కార్యదర్శి సాయిలు, ఉపాధ్యక్షులు రాజన్న, శ్యాం, స్వామి, సిద్ది రాములు, నాయకులు నర్సింలు, సంతోష్, యాదగిరి, మణెమ్మ, యాదమ్మ, రాజు, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.



నిజామాబాద్ నగరంలో పాదయాత్రగా కలెక్టరేట్‌కు తరలుతున్న జీపీ కార్మికులు, సీఐటీయూ నాయకులు

కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించిన ఎంపీపీ

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి



మండలంలోని అర్గుల్ గ్రామపంచాయతీలో కంటి వెలుగు శిబిరాన్ని ఎంపీపీ కుంచాల విమల రాజు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పద్మా రాజేందర్, వైస్ ఎంపీపీ తిరుపతిరెడ్డి, కో ఆప్షన్ నెంబర్ బులెట్ అక్బర్ ఖాన్, ఎంపిడిఓ లక్ష్మణ్, పంచాయతీ కార్యదర్శి రాజేశ్వర్, వార్డు సభ్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాస్థాయి వ్యాసరచన పోటీల్లో కృష్ణవేణి విద్యార్థిని ప్రతిభ

- అభినందించిన జాయింట్ కలెక్టర్

నవతెలంగాణ-ఆర్మూర్

బాల్కొండ మండల కేంద్రంలోని కృష్ణవేణి ఉన్నత పాఠశాలకు చెందిన పదవ తరగతి విద్యార్థిని హరిని జంతు పరిరక్షణ మానవుల బాధ్యత అనే అంశంపై జిల్లా స్థాయిలో వ్యాసరచన పోటీలు ఇటీవల నిర్వహించారు. ఇందులో జిల్లాలోని ఇంగ్లీష్ మీడియం స్థాయిలో ప్రథమ బహుమతి సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ విజయ్ కర్తాన్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని జాయింట్ కలెక్టర్ చంద్రశేఖర్ ప్రతిభ కనపరిచిన విద్యార్థినికి అభినందించారు. గత నెల జనవరి 29న మండల స్థాయిలో ప్రథమ స్థానం సాధించగా, ఇటీవల జిల్లా కేంద్రంలోని వ్యాసరచన పోటీలు నిర్వహించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని హరిని పాఠశాల డైరెక్టర్లు భానుచందర్ ,ఆకుల లక్ష్మణ్ ఉపాధ్యాయ బృందం తదితరులు అభినందించారు.

ఒక పూట ఆలస్యమైనా వడ్డీలేని రుణం వర్తించదు

- కలెక్టర్ కార్యాలయం ఎదుట పీఓడబ్ల్యూ ధర్నా
- డ్వాక్రా మహిళ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ఒక పూట ఆలస్యమైనా వడ్డీ లేని రుణం వర్తించదనే నిబంధనల వల్ల రుణ భారం పెరుగుతుందని, వెసులుబాటు లేక బయటినుండి అప్పులు అధిక వడ్డీకి సైతం తెచ్చి కట్టేవారున్నారని గోదావరి, సంధ్య అన్నారు. ప్రగతిశీల మహిళా సంఘం (పీఓడబ్ల్యూ) నిజామాబాద్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం డ్వాక్రా మహిళల సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ ఆఫీసు ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ.. డ్వాక్రా మహిళలు వేలకోట్ల రూపాయలు పొదుపు చేసి బ్యాంకుల్లో జమ చేసి రుణాలు పొందుతూ ప్రతినెల వడ్డీ చెల్లిస్తున్నారని అన్నారు. ఒక పూట ఆలస్యం అయినా వడ్డీలేని రుణం వర్తించదని, నిబంధనల వల్ల రుణ భారం పెరుగుతుందని, వెసులుబాటు లేక బయటినుండి అప్పులు అధిక వడ్డీకి సైతం తెచ్చి కట్టేవారున్నారని తెలిపారు. అభయ హస్తం పథకంలో దాదాపు 20,76,403 మంది మహిళలు తమ వాటాగా డబ్బు జమ చేశారు అని తెలిపారు. సుమారు 600 కోట్ల రూపాయలు ప్రభుత్వ ఖజానాలో ఉన్నాయని, సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ పథకం అమలు చేయకుండా వారి డబ్బు తిరిగి ఇవ్వకుండా ప్రభుత్వం మహిళలకు అన్యాయం చేస్తుందని అన్నారు. పొదుపు చేసిన సంఘాలకు రివాల్వింగ్ ఫండును ఇవ్వడం లేదని, 10 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు ఇస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదని అన్నారు. డ్వాక్రా గ్రూపు సభ్యుల పిల్లలకు ఇచ్చే స్కాలర్షిప్‌లు, సభ్యులు మరణిస్తే ఇవ్వాల్సిన సహాయం, ఎస్సీలకు ఇచ్చే రాయితీలు, ఇన్సూరెన్స్ ప్రభుత్వం ఇవ్వటం లేదని తెలిపారు. మహిళలకు ఆర్థిక స్వావలంబన చేకూర్చే విధంగా ప్రభుత్వం వ్యవహరించటం లేదని, దీని కారణంగా పేద మహిళలు అప్పులపాలై మెడలోని నగలు, ఆస్తులు అమ్ముకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు శకుంతల, గౌరక్క జిల్లా కమిటీసభ్యులు కీర్తన, నర్సక్క, సావిత్రి, లక్ష్మి, గీత ,మంజుల అంబికా తదితరులు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్, అధికారులు



కలెక్టరేట్ ఎదుట ధర్నాచేస్తున్న మహిళలు

ప్రశంసా పత్రాలు అందజేత

ఇటీవల నిర్వహించిన జంతు సంక్షేమ పక్షోత్సవాల సందర్భంగా నిర్వహించిన జిల్లాస్థాయి ఉపన్యాస పోటీలలో నెగ్గిన విద్యార్థులకు జిల్లా కలెక్టర్, జంతు సంక్షేమ మండలి చైర్మన్ ద్వారా జారీ చేసిన ప్రశంసా పత్రాలను, మెమోంటోలను కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులు జంతు సంక్షేమం పట్ల అవగాహన పెంపొందించుకొని ఇతరులకు తెలియజేస్తూ మూగజీవాల పట్ల ప్రేమ, దయ కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ వి.జగన్నాథ చారి, సహాయ సంచాలకులు డాక్టర్ బాలిక్ అహ్మద్, డాక్టర్ బసవ రెడ్డి, విద్యాశాఖ అదనపు కమిషనర్ పాల్గొన్నారు

ప్రజావాణికి 80 ఫిర్యాదులు

ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 80 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీఆర్డీఓ చందర్ లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

- సర్పంచ్ స్వరూప

నవతెలంగాణ-నవీపేట్



కంటివెలుగుపై ప్రచారం చేస్తున్న ఆశాలు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నాగేపూర్ సర్పంచ్ స్వరూప అన్నారు. నాగేపూర్ గ్రామంలో ఆశ కార్యకర్తలు మంగళవారం జరిగే కంటి వెలుగు కార్యక్రమానికి ఆహ్వానించగా గ్రామంలోని అంధత్వ సమస్యతో బాధపడుతున్న ప్రతి ఒక్కరికి సమాచారం ఇచ్చి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ సూచించారు. ఆశ కార్యకర్తలు సోమవారం ఇంటింటికి వెళ్లి ఈ సందర్భంగా ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు పద్మలత, అనురాధలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సాయన్న పార్థివ దేహానికి నివాళు లర్పించిన మంత్రి వేముల



నివాళ్లు అర్పిస్తున్న మంత్రి వేముల

నవతెలంగాణ-కంఠేశ్వర్

కంటోన్మెంట్ ఎమ్మెల్యే సాయన్న పార్థివ దేహానికి శాసన సభ వ్యవహారాల మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి సోమవారం పుష్పాంజలి ఘటించారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అక్కడే మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్యే సాయన్న మరణం బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటన్నారు. సాయన్న నిజామాబాద్ జిల్లా వాస్తవ్యులు అని,హైదరాబాద్ లో బ్యాంకు ఉద్యోగిగా సేవలందించి రాజీనామా చేసి రాజకీయాల్లోకి వచ్చి కంటోన్మెంట్ ఎమ్మెల్యేగా ఐదు పర్యాయాలు ఇక్కడి ప్రజలకు సేవలందించారని గుర్తు చేశారు. సాయన్న నిజమైన అంబేద్కరిస్ట్ అని ఆయన ఆశయ స్ఫూర్తి కొనసాగిస్తామని తెలిపారు.

27న సైన్స్ టాలెంట్ టెస్ట్

నవతెలంగాణ-ముప్కాల్

రిటైర్డ్ ఉద్యోగుల అసోసియేషన్ ఆఫ్ ముప్కాల్ ఆధ్వర్యంలో ఈ నెల 27న సీ.వీ రామన్ జయంతిని పురస్కరించుకుని 'నేషనల్ సైన్స్ డే' కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని రిటైర్డ్ ఉపాధ్యాయుల సంఘం ప్రతినిధులు పల్లికొండ గోపీనాథ్ సోమవారం తెలిపారు. బాల్కొండ ఉమ్మడి మండలాల నుంచి ప్రభుత్వ పాఠశాల, కేజీబీవీ, మోడల్ స్కూల్ విద్యార్థులు (ప్రతి పాఠశాల నుంచి 5 గురు విద్యార్థులు) తెలుగు, ఇంగ్లీషు మీడియం విద్యార్థులు పాల్గొనేలా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. బయో సైన్స్, ఫిజికల్ సైన్స్ లపై విద్యార్థులకు ముప్కాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం మూడు గంటల సమయంలో టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తామని పేర్కొన్నారు.

పరీక్ష తేదీల్లో మార్పులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని పీజీ మొదటి, మూడవ సెమిస్టర్ (ఎంసిఎ, ఎంబిఎ, ఐఎంబిఎ, ఎల్ ఎల్ ఎం, ఎల్ ఎల్ బి), 5 వ సెమిస్టర్ ఎల్ఎల్ఎం, ఐఎంబిఎ 7వ, 9వ సెమిస్టర్ పరీక్షలు ఈనెల 24 నుండి ప్రారంభం కావాల్సి ఉండగా వాయిదా వేశామని ప్రారంభమవుతాయని తెలంగాణ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారిణి ప్రొఫెసర్ డాక్టర్ ఎం అరుణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలు మార్చ్ 8 నుంచి ఉంటాయని పేర్కొన్నారు. విద్యార్థులు గమనించాలని కోరారు.

ప్రశాంతంగా పరీక్షలు..

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో సోమవారం జరిగిన యూజీ 1వ సెమిస్టరు (రెగ్యులర్) పరీక్షలో 8645మంది విద్యార్థులకు గాను 7801మంది హాజరయ్యారని, 844 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ప్రొఫెసర్ డాక్టర్ ఎం అరుణ తెలిపారు.

సేవాలాల్ జయంతిలో గిరిజనులందరు భాగస్వాములు కావాలి

- నోడల్ అధికారి సింహాచలం

నవతెలంగాణ-భీంగల్

ఈ నెల 23న అధికారికంగా నిర్వహించే సేవాలాల్ జయంతి వేడుకల్లో ప్రతి ఒక్క గిరిజనుడు భాగస్వాములు కావాలని నోడల్ అధికారి సింహచలం తెలిపారు. సోమవారం పట్టణ కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలంలో మండలంలోని గిరిజన సర్పంచ్‌లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణ కేంద్రంలోని బంజార భవన్‌లో నిర్వహించే సేవాలాల్ జయంతిలో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి హాజరు కానున్నారని, కనుక ప్రతి ఒక్కరు హజరు కావాలని తెలిపారు. అంతకు ముందు బంజార భవన్ వద్ద వేడుకలు జరిపే స్థలాన్ని పరిశిలించారు. సమావేశంలో ఎంపీడీవో రాజేశ్వర్, తహసీల్దార్ శ్రీధర్‌కుమార్, జెడ్పీటీసి చౌట్‌పల్లి రవి, యంపిపి ఆర్మూర్ మహేష, టీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దొనకంటి నర్సయ్య, రైతుబంధు మండల అధ్యక్షుడు శర్మనాయక్, టీఆర్ఎస్ నాయకులు , మండల సర్పం,చ్‌లు, యంపిటీసిలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నోడల్ అధికారి సింహాచలం

ధైర్యానికి, ధీరత్వానికి ప్రతీక శివాజీ

నైన్ స్టార్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ చైర్మన్ పైడి రాకేష్ రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్

ధైర్యానికి, ధీరత్వానికి ప్రతీక శివాజీ అని నైన్ స్టార్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ చైర్మన్ పైడి రాకేష్ రెడ్డి అన్నారు. మండలంలోని అంకాపూర్ గ్రామ జాతీయ రహదారి దగ్గర ఆదివారం రాత్రి శివాజీ జయంతి ఉత్సవాలలో భాగంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అతిపెద్ద భారీ విగ్రహాన్ని పైడి రాకేష్ రెడ్డి కుటుంబ సభ్యులతో ఆవిష్కరించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ.. శివాజీని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ధర్మం కోసం పోరాటం చేసి తమ జీవితాలను త్యాగం చేసిన మహోన్నత వ్యక్తుల జీవితాలను నేటి యువతకు తెలియజేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర మార్క్ ఫైడ్ చైర్మన్ మార గంగారెడ్డి జెండా ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో పల్లె గంగారెడ్డి, ఉప సర్పంచ్ కిషోర్ రెడ్డి, కొమ్ముల గంగారెడ్డి, మార చంద్రమోహన్, సురేష్ రెడ్డి, రవి రాజ్, లాలన వృద్ధాశ్రమ వ్యవస్థాపకులు రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించిన రాకేష్‌రెడ్డి

స్వర్ణోత్సవ మహాసభలను జయప్రదం చేయండి

- బీడీ వర్కర్స్ యూనియన్ పిలుపు

నవతెలంగాణ-ఆర్మూర్

తెలంగాణ ప్రగతి శీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా స్వర్ణోత్సవ మహాసభను జయప్రదం చేయాలని బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు సూర్య శివాజీ అన్నారు. సోమవారం పట్టణంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఈనెల 22న ధర్పల్లి మండల కేంద్రంలో తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ స్వర్ణోత్సవం సందర్భంగా జిల్లామహాసభ ఉంటుందని తెలిపారు. 1972లో ఏర్పడిన బీడీ వర్కర్స్ యూనియన్ 50 సంవత్సరాల నుండి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేస్తుందన్నారు. బీడీ పరిశ్రమను నిర్వీర్యం చేయటానికి నరేంద్రమోడీ కేంద్ర ప్రభుత్వం కొట్పా చట్టాన్ని తెచ్చి పార్లమెంట్లో బిల్లు రూపంలో కాచుకొని కూర్చుందని అన్నారు. చట్టం కనుక అమలు అయితే తెలంగాణలో ఏడు లక్షల మంది దేశ వ్యాప్తంగా 60 లక్షల మంది 50 లక్షల మంది తునికి ఆకు తెంపే కార్మికులు 40 లక్షల మంది పొగాకు పండించే రైతులు బీడీ పరిశ్రమపై ఆధారపడ్డ కోటి 50 లక్షల మందికి ఉపాధి పోయే ప్రమాదం ఏర్పడిందన్నారు. బీడీ కార్మికులకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు చూపెట్టకుండా కేంద్ర ప్రభుత్వం కొట్పా చట్టం తేవటం అన్యాయమన్నారు. బీడీ పరిశ్రమ నుండి కొట్పా చట్టాన్ని మినహాయించాలని సూర్య శివాజీ డిమాండ్ చేశారు. సీఎం కేసీఆర్ ఆంక్షలు లేని జీవనభృతి వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా మహాసభలో బీడీ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నుశ్రాట్ బేగం, కాంత, లక్కారం లక్ష్మి, విజయం, గంగు, రూప తదితరులు పాల్గొన్నారు.

'బీఆర్ఎస్ వ్యాపారి మార్కెట్‌ను శాసిస్తున్నాడు'

- తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ అన్వేష్ రెడ్డి

నవతెలంగాణ-మోర్తాడ్

నిజామాబాద్ జిల్లాలో ఎర్ర జొన్న సాగు చేస్తున్న రైతులను ప్రభుత్వం పట్టించుకోక పోవడంతో అధికారపార్టీకి చెందిన బీఆర్ఎస్ వ్యాపారి మార్కెట్‌ను శాషించే స్థాయికి ఎదిగిపోతున్నారని అన్నారు. మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎర్ర జొన్న పంట చేతికి వచ్చే సమయానికి వ్యాపారస్తులందరూ సిండికేట్‌గా ధరలను తగ్గిస్తూ రైతులను మోసం చేస్తున్నారని అన్నారు. పంట చేతికొచ్చే సమయంలో వ్యాపారస్తులు నాలుగువేల రూపాయలకు క్వింటాలు కొనుగోలు చేసి రైతులు అమ్మే సమయానికి మూడు వేల నుండి 3500 రూపాయలకు తగ్గించారని తెలిపారు. గతంలో 40వేల ఎకరాలు సాగయ్యే ఎర్రజొన్న ప్రస్తుతం 25వేల ఎకరాల్లోనే సాగు అవుతుందని తెలిపారు. ప్రభుత్వం వ్యాపారస్తులపై కఠిన చర్యలు తీసుకోకపోవడం వల్లే వ్యాపారస్తులందరూ సిండికేట్‌గా రైతులను మోసం చేస్తున్నారని అన్నారు. రైతులకు రావాల్సిన 11 కోట్ల రూపాయలు ఇచ్చామంటూ భజన చేస్తున్న అధికార పార్టీ పంటను ఎందుకు కొనుగోలు చేయడం లేదని ప్రశ్నించారు. గత ఎన్నికల ప్రచారంలో ఎర్ర జొన్న పసుపు పంటను కొనుగోలు చేస్తామంటూ ప్రచారం చేసి ఎందుకు కొనుగోలు చేయకుండా రైతులను మోసం చేస్తుందో చెప్పాలని డిమాండ్ చేశారు. స్థానిక మంత్రి బైబ్యాక్ ఒప్పందాలను చేసుకోమని చెబుతున్న మాటలు వ్యాపారస్తులకే లాభం చేకూరుతున్నాయని తెలిపారు. అధికార పార్టీకి చెందిన ఓ బడా వ్యాపారికి లాభం చేకూరే విధంగా ఈ బై బ్యాక్ ఒప్పందాలు జరుగుతున్నాయని అన్నారు. ఎర్ర జొన్న పంటను 4000 రూపాయలకు క్వింటాలు చొప్పున ప్రభుత్వమే కొనుగోలు చేయాలని పసుపును ఎనిమిది వేల రూపాయలకు ప్రభుత్వమే కొనుగోలు చేయాలని అన్నారు. అధిక ధరలు ఉంటే పాలాభిషేకాలు చేస్తున్న నాయకులు తక్కువ ధర ఉన్నప్పుడు ఎందుకు ప్రశ్నించడం లేదని అన్నారు. తక్కువ ధర ఉన్నప్పుడు నాయకులను మెడలపై చెప్పుల దండలు వేయాలని తెలిపారు. రైతుల పక్షాన ఈనెల 23న కిసాన్ కాంగ్రెస్ బృందం పసుపు మార్కెట్ను సందర్శిస్తుందని అన్నారు. కిసాన్ కాంగ్రెస్ రైతులకు అండగా నిలుస్తుందని రైతులెవరు ఆధర్యపడవద్దని అన్నారు. సమావేశంలో వేల్పూర్ మండల అధ్యక్షుడు నర్సారెడ్డి, జిల్లా జనరల్ సెక్రటరీ దామోదర్ గౌడ్, రొక్కం మురళి, మహిపాల్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అన్వేష్‌రెడ్డి

నాయకుల దృష్టికి మండల సమస్యలు

- జడ్పీ స్థాయి స్టాండింగ్ సమావేశంలో జడ్పీటీసీ

నవతెలంగాణ-ముప్కాల్

ముప్కాల్ జడ్పీటీసీ సభ్యురాలు బద్దం నర్సవ్వ సోమవారం జిల్లా జెడ్పి స్థాయి స్టాండింగ్ సమావేశంలో పాల్గొన్నారు. సమావేశంలో ఆమె ముప్కాల్ మండలంలోని పలు సమస్యలను పెద్దల దృష్టికి తీసుకెళ్లారు. మండలంలోని ఆయా గ్రామాల్లో చేపట్టవలసిన పనులపై మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లాలోని వివిధ మండలాల జడ్పీటీసీ సభ్యులు పాల్గొని పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.

నేడు జిల్లాస్థాయి భౌతిక రసాయన శాస్త్ర ప్రతిభ పరీక్ష

నవతెలంగాణ-ఆర్మూర్

జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని మామిడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్టు సైన్సు ఉపాధ్యాయులు శివప్రసాద్, రఘునాథ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని వివిధ మండలాలలో సెలెక్ట్ అయిన వారికి ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచిన ఇద్దరు విద్యార్థులు తప్పకుండా జిల్లా స్థాయి ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్ లో పాల్గొనాలని పేర్కొన్నారు. ఈ టాలెంట్ పరీక్షలో సెలెక్ట్ అయిన ఇద్దరినీ రాష్ట్రస్థాయికి పంపడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా విద్య శాఖ అధికారి దుర్గాప్రసాద్ వస్తున్నట్టు తెలిపారు .మరింత సమాచారంకోసం 9391111093 నంబర్ కు సంప్రదించాలని పేర్కొన్నారు.

సబ్ స్టేషన్ నిర్మాణ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఎంపీటీసీ, అధికారులు

నవతెలంగాణ-ముప్కాల్

మండలంలోని నల్లూరు గ్రామానికి ఈ మధ్య కాలంలో మంజూరైన 33/11కెవి సబ్ స్టేషన్ లైన్ నిర్మాణ పనులను సోమవారం నల్లూర్ ఎంపీటీసీ సత్య నారాయణ విద్యుత్ అధికారులతో కలిసి పరిశీలించారు. స్థలాన్ని పరిశీలించి వీలైనంత తొందరగా పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. స్థలాన్ని మొత్తం చదును చేయించారు. పనుల్లో అలసత్వం వహించకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటమన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ స్రవంతి నవీన్, పంచాయతీ సెక్రటరీ శంకర్, లైన్ ఇన్స్పెక్టర్ మల్లేష్, లైన్ మెన్ భూమేష్, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, వార్డ్ సభ్యులు, విద్యుత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమాన్ని కేంద్రం విస్మరించింది

- న్యాల్కల్ గ్రామంలో హాత్ సే హాత్ జోడో యాత్ర



మాట్లాడుతున్న టీపీసీసీ కోశాధికారి సుదర్శన్‌రెడ్డి

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని న్యాల్కల్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో హాత్ సే హాత్ జోడో యాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కోశాధికారి మాజీ మంత్రి పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పేద మధ్యతరగతి ప్రజల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను బడా బాబులకు కట్టబెడుతున్నారని విమర్శించారు. ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను అప్పుల మయంగా సీఎం కేసీఆర్ మార్చారని ఆయన అన్నారు. రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడోయాత్రను విజయవంతమైందని తిరిగి కాంగ్రెస్‌కు పూర్వ వైభవం రానుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రెండు లక్షల రూపాయల రుణమాఫీ అలాగే 500 రూపాయలకే సిలిండర్ ను పంపిణీ చేస్తామని తెలిపారు. మూప్ప గంగా రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చేవరకు ప్రతి కార్యకర్త సైనికులా పని చేయాలని, రానున్నది మన ప్రభుత్వమని పేద బడుగు బలహీనవర్గాల ప్రభుత్వమని తెలిపారు. ప్రతి పేదవాడికి తమ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందుతాయని కుటుంబ పాలన నుంచి విముక్తి కలుగుతాయని ఆయన అన్నారు. కార్యక్రమంలో అర్బన్ ఇంచార్జ్ తాహెర్‌బిన్, భూపతి రెడ్డి, నగేష్ రెడ్డి, శేఖర్ గౌడ్, గడుగు గంగాధర్, మాజీ ఎంపీపీ యాదగిరి, మోపాల్ మండల అధ్యక్షుడు గున్ని రవి, మండల ఉపాధ్యక్షుడు కడుదూరం సాయికుమార్, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు

ప్రహరీ గోడ నిర్మాణానికి భూమిపూజ



పనులకు భూమిపూజ చేస్తున్న ప్రజాప్రతినిధులు, సంఘం సభ్యులు

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలంలోని తాళ్ళ రాంపూర్ గ్రామానికి చెందిన ముదిరాజ్ సంఘ సభ్యులు ప్రహరీ గోడ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సంఘ భవనానికి ప్రహరీ లేకపోవడంతో మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డికి అడిగిన వెంటనే 3 లక్షల రూపాయలు మంజూరు చేశారని తెలిపారు. మంత్రి వేములకు సంఘం తరపున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పూర్ణానందం, ఎంపీపీ ఉపేందర్‌రెడ్డి, జడ్పీటీసీ గుల్లే రాజేశ్వర్, సర్పంచ్ భానుప్రసాద్, ఎంపీటీసీ ఆడేం సవిత గంగాప్రసాద్, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షులు బోనగిరి రమేష్, ముదిరాజ్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

నర్సరీల తనిఖీ

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని పలు గ్రామాల్లోని నర్సరీలను ఎంపీడీవో లక్ష్మణ్ సోమవారం తనిఖీ చేశారు. మండలంలోని తొర్లికొండ బ్రాహ్మణపల్లి గ్రామాల్లోని నర్సరీలను ఉపాధి హామీ పనులను సోమవారం తనిఖీ చేసి పలు సూచనలను సలహాలను చేశారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు తదితరులున్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని గొల్లపల్లి మండల పరిషత్ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఎస్ఎంసీ చైర్మన్ జె.సత్యం, వైస్ చైర్మన్ రెడ్డి మల్లేష్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలని, విద్యార్థులను చదువులో తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులను కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గణేష్, అంగన్వాడీ టీచర్ జ్యోతి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్ గంగాధర్ మృతికి నివాళి



నవతెలంగాణ-కోటగిరి

మండల పరిషత్ కార్యాలయలో సీనియర్ జర్నలిస్ట్ హంగర్గ గంగాధర్ ఈనెల 9వ తారీఖున మృతిచెందడంతో ప్రెస్‌క్లబ్ తరఫున ఆయన చిత్రపటానికి సోమవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మరణం తీరని లోటని పలువురు పాత్రికేయులు తెలిపారు. ఆయన అడుగుజాడలలో ప్రతి ఒక్కరూ ముందుకు నడవాలని సూచించారు. కార్యక్రమంలో మండల విలేకరులు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలోని రాకాసిపేటలో సోమవారం ఓ వ్యక్తి వద్ద 500 గ్రాముల ఎండు గంజాయి పట్టుబడిందని.. ఆ వ్యక్తిని పట్టుకుని గంజాయిని స్వాధీనం చేసుకున్నామని ఎక్సైజ్ సీఐ రూప్‌సింగ్ తెలిపారు. ఆ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

షెడ్యూల్ ప్రకారం పంటను తీసుకురావాలి

- ఏఈఓల నుంచి టోకెన్లు పొందాలి
- ఏవో రాజు

నవతెలంగాణ-మద్నూర్

రైతులు శనగ పంటను వ్యవసాయ శాఖ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని, రైతులు ఆయా గ్రామాల వ్యవసాయ విస్తీర్ణ అధికారుల నుంచి టోకెన్లు పొందాలని ఏవో రాజు తెలిపారు. ఈనెల 21 నుంచి మద్నూర్, డొంగ్లి సింగిల్ విండోల పరిధిలో శనగ పంట మద్దతు ధర కొనుగోలు కేంద్రాలు ప్రారంభమవుతాయని షెడ్యూల్ ప్రకారం తేదీల వారిగా రైతులు అమ్మటానికి తీసుకురావాలని పేర్కొన్నారు. మద్దతు ధర రూ.5335 ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు.

ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా 64 మంది రక్తదానం

నవతెలంగాణ-మద్నూర్

ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని పురస్కరించుకొని మద్నూర్ మండల కేంద్రంలో గల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ 30 పడకల ప్రభుత్వాసుపత్రిలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి యువకులు పెద్ద సంఖ్యలో ముందుకు వచ్చి 64 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా మద్నూర్ మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు బండివార్ విజయ్ వారికి అభినందనలు తెలియజేశారు. రక్తదాన శిబిరానికి నాయకుడు కృష్ణ పటేల్ ప్రత్యేకంగా చొరవ తీసుకొని ఈ కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు.

మద్నూర్ ఐకేపీ ఏపీఎంగా మనోహర్



నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ మండల ఐకేపీ ఏపీఎంగా మనోహర్ నూతనంగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళా సంఘాల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. మనోహర్ మాచారెడ్డి మండలం నుంచి మద్నూర్ మండలానికి వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహించిన ఏపీఎం ప్రసన్నకుమార్ రామారెడ్డికి బదిలీపై వెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే మహిళా సంక్షేమానికి ప్రత్యేకంగా కృషి చేయనున్నట్టు తెలిపారు.

కంటి వెలుగు కేంద్రాన్ని ప్రారంభించిన ఎంపీపీ



కంటి వెలుగును ప్రారంభిస్తున్న ఎంపీపీ

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని బస్వాపూర్ గ్రామంలో సోమవారం కంటి వెలుగు కేంద్రాన్ని ఎంపీపీ గాల్‌రెడ్డి సర్పంచ్ మల్లేష్ మంజుల మల్లారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ తమ నేత్రాలను పరీక్షించుకోవాలని, అవసరమైన వారికి అద్దాలు అందజేయనున్నట్టు తెలిపారు. ఆపరేషన్లు అవసరం ఉన్నవారికి ఉచితంగా ఆపరేషన్లు చేస్తారని వివరించారు. కార్యక్రమంలో ఆత్మకమిటీ చైర్మన్ నరసింహారెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ హనుమంత్‌రెడ్డి, ఆలయ పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ బుర్రి గోపాల్, ఉప సర్పంచ్ బిక్షపతి, పంచాయతీ కార్యదర్శి దయాకర్, ఎంపీటీసీ లీలావతి బాలాగౌడ్, భిక్కనూర్ మాజీ సర్పంచ్ నాగభూషణం గౌడ్, సొసైటీ వైస్ చైర్మన్ మద్ది స్వామి, బీఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు అమరావతి సిద్ధిరామిరెడ్డి, వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రమైన రెంజల్ గ్రామపంచాయతీ ఆవరణలో ఆరుగురికి షాదీముబారక్ చెక్కులను సర్పంచ్ ఎమ్మెస్ రమేష్ కుమార్ సోమవారం అందజేశారు. నిరుపేదలకు ఆర్థికంగా ఆదుకోవడానికి సీఎం కేసీఆర్ ఈ బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రఫిక్, గ్రామ కమిటీ అధ్యక్షులు టి.అంజయ్య, మండల కార్యదర్శి అనిల్, సాయగౌడ్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ఛత్రపతి శివాజీ విగ్రహావిష్కరణ

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని పోసానిపేటలో ఛత్రపతి శివాజీ జయంతిని పురస్కరించుకొని ఆదివారం రాత్రి శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్లు గంధ్ర అంజయ్య, బండి శేఖర్, పాలికల లక్ష్మీపతి రూ.4 లక్షలు సొంత డబ్బులతో నిర్మించారని, వారికి గ్రామం తరఫున సర్పంచ్ గిరిరెడ్డి మహేందర్‌రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వారికి శాలువాతో సన్మానించి, పుష్పగుచ్ఛాలు అందజేశారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామ యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరం పరిశీలన

నవతెలంగాణ-దోమకొండ

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని జడ్పీటీసీ సభ్యులు తీగల తిర్మల్‌గౌడ్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ సూచన మేరకు కంటి వెలుగు శిబిరాన్ని సందర్శించినట్లు ఆయన వివరించారు. కంటి వెలుగు శిబిరంలో గ్రామస్తులకు వసతులు పరిశీలించారు. కార్యక్రమంలో కంటి వెలుగు వైద్య శిబిరం ఇంచార్జి అధికారి మారుతి, కంటి వైద్యురాలు ప్రవళిక, మండల కోఆప్షన్ సభ్యులు శమ్మి, టీఆర్ఎస్ పార్టీ నాయకులు చాకలి నరసింహులు, ముదాం రవి, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, ఐకేపీ సీఏలు ఉన్నారు.

కనీస మద్దతు ధరల చట్టమేది..?

- పోడు పట్టాలపై ప్రతినెలా ప్రచారమే
- రైతు వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలి
- తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్



మాట్లాడుతున్న తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్

నవతెలంగాణ-బోధన్

కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలపై సమరశీల ఉద్యమాలు చేపట్టాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ అన్నారు. సోమవారం బోధన్ పట్టణంలో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతాంగానికి రాతపూర్వకంగా ఇచ్చిన హామిని తుంగలో తొక్కిందని అన్నారు. కనీస మద్దతు ధరల చట్టం చేస్తామని అమలు చేయలేదన్నారు. రైతుల ఆత్మహత్యల నివారణకు బడ్జెట్‌లో ఎలాంటి కేటాయింపులు చేయలేదని అన్నారు. ఇప్పటి వరకు దేశంలో ప్రకృతి వైపరీత్యాల వలన జరిగిన నష్టానికి ఎలాంటి పరిహారం అందలేదని తెలిపారు. ఈ సంవత్సరం వానాకాలం సీజన్‌లో నాణ్యతలేని విత్తనాలు విక్రయించడంతో విజిలెన్స్ శాఖాధికారులు 200 కేసులు నమోదు చేశారని, 20 వేల క్వింటాళ్ళ నాసిరకం విత్తనాలు పట్టుబడ్డాయని అయిన గాని ఎవరిపై కేసులు కానీ, లైసెన్స్‌లు రద్దు చేయడం లాంటివి చేయలేదన్నారు. ప్రభుత్వం రుణ మాఫీ ప్రకటించడంతో అటూ ప్రభుత్వం, ఇటూ రైతులు చెల్లించకపోవడం వలన బ్యాంకులు పంట రుణాలు ఇవ్వలేదని, వానాకాలం, యాసంగి సీజన్‌లో కలిసి రూ. 83 వేల కోట్లు పంట రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ 20శాతం కూడా రుణాలు ఇవ్వలేదన్నారు. రూ.50 వేల రుణాలలోపు వారికీ చెల్లిస్తామన్న ప్రభుత్వం పూర్తిగా చెల్లించలేదని, 10వ విడత రైతుబంధు పంపిణీ చేస్తున్నట్లు ప్రకటించినప్పటికీ, 10 లక్షల మంది సన్న, చిన్నకారు రైతులకు రైతుబంధు రాలేదని అన్నారు. రైతుబీమా 31 లక్షల మందికి మాత్రమే పరిమితంగా చేశారని పేర్కొన్నారు. ధరణి వెబ్‌సైట్‌లో 20 లోపాలు ఉన్నట్లు క్యాబినేట్ కమిటీ గుర్తించిన, 13 లోపాలను సరిచేయడానికి రైతుల నుండి రూ. 1650/- రుసుమును మీసేవ ద్వారా వసూళ్ళ చేశారని, 4.5 లక్షల మంది డబ్బులు చెల్లించినా, ఇంత వరకు రికార్డులను సరిచేయలేకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం అన్నారు. పోడు సాగుదారులకు ప్రతి నెల పట్టాలు ఇస్తామంటూ ప్రచారం చేయడమే తప్ప ఆచరణలో ముందుకు సాగడం లేదన్నారు. వ్యవసాయ ఉత్పత్తులకు రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధరలు నిర్ణయించి అమలు చేయడానికి, 'ధరల నిర్ణాయక కమీషన్‌ను' వెంటనే ఎర్పాటు చేయాలని, కేరళ తరహా రుణ విమోచన కమిషన్ రాష్ట్రంలో పని ప్రారంభించాలని, రుణ మాఫీని ఎకకాలంలో చెల్లించి, రైతులను రుణ విముక్తులను చేయాలని, ప్రకతి వైపరిత్యాల నష్టానికి వెంటనే పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రతి ఏటా ఎప్రిల్‌లో వ్యవసాయ ప్రణాళికను విడుదల చేయాలని, రైతుబీమాను 18-75 సంవత్సరాల వరకు పోడిగించాలని కోరారు. రైతులు 13 నెలల పాటు ఢిల్లీలో ఆందోళన చేపట్టినా బీజేపీ ప్రభుత్వం స్పందించలేదని, ప్రపంచానికి ఈ ఉద్యమం చేరడంతో మోడి ప్రభుత్వం దిగిరాక తప్పలేదన్నారు. పాలక వర్గాలు కార్పోరేట్ వర్గాలకు అనుకూలంగా పని చేస్తున్నాయని కావున రైతులు ఉద్యమించాలని అందులో భాగంగా ఏప్రిల్ 5 న ఢిల్లీలో రుణమాఫీ చేయాలని, మద్దతు ధర కల్పించాలని కోరుతూ చలో ఢిల్లీ కార్యక్రమం తలపెట్టినట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి రైతులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అటవీ హక్కుల చట్టం ప్రకారం పోడు భూములను సాగుచేసుకుంటున్న వారికి హక్కు పత్రాలు అందించాలన్నారు. దరఖాస్తు చేసుకున్న రైతులకు పోడు సాగుదారులకు హక్కు పత్రాలు అందించాలని, రైతు భీమా, రైతుబంధు అనేది భూస్వాములకే అనుకూలంగా ఉంది కాని కౌలు రైతులకు ఎలాంటి ఉపయోగం లేదని దీనిని సాగుచేస్తున్న కౌలు రైతులకు వర్తించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు గంగాధర్ అప్పా, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్ బాబు, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా అధ్యక్షులు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగుపై మరింత అవగాహన కల్పించాలి

- కలెక్టర్ జితేష్ వి పాటిల్
- ప్రభుత్వ ఆసుపత్రి తనిఖీ

నవతెలంగాణ-భిక్కనూర్

కంటి వెలుగుపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రికి వైద్యం కోసం వచ్చే రోగుల రిజిస్టర్‌ను పరిశీలించారు. అనంతరం మెడికల్ స్టోర్ రూమ్‌ను పరిశీలించి మందులను రోగులకు అందించాలని ఫార్మసిస్టుకు సూచించారు. ప్రస్తుతం కంటి వెలుగు కార్యక్రమం కొనసాగుతున్నందున ప్రజలకు కంటి వెలుగుపై మరింత అవగాహన కల్పించి కంటి వెలుగు కేంద్రానికి వెళ్లేటట్టు చూడాలని వైద్యాధికారులకు సూచించారు. కార్యక్రమంలో పట్టణ సర్పంచ్ తునికి వేణు, ఎంపీడీవో అనంతరావు, ఎంపీఓ ప్రవీణ్ కుమార్, ఉప సర్పంచ్ నరేష్, జిల్లా ఉప వైద్యాధికారి శోభారాణి, మండల వైద్యాధికారి యేమిమా, ఆయుర్వేద వైద్యులు వెంకటేశ్వర్లు, పీహెచ్ఎస్ జానాబాయ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



ప్రభుత్వాస్పత్రిని తనిఖీ చేస్తున్న కలెక్టర్

అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు..

అంగన్వాడీ కేంద్రాలలో అంగన్వాడీ టీచర్లు అవకతవకలకు పాల్పడితే శాఖ పరమైన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టర్ వచ్చిన సమయంలో రిజిస్టర్‌లో నమోదు చేసిన విద్యార్థులు లేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం బాలింతలకు, గర్భిణీలకు, చిన్న పిల్లలకు కోట్లాది రూపాయలు ఖర్చుపెట్టి బలమైన పోషకాహారాన్ని అందజేస్తుందని అంగన్వాడీలు లబ్ధిదారులకు, విద్యార్థులకు నాణ్యతతో కూడిన విధంగా పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ సర్పంచ్ తునికి వేణు, ఎంపీడీవో అనంతరావు, ఎంపీఓ ప్రవీణ్ కుమార్ అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

చౌదరి చెరువులో మత్స్యకారులకు వృత్తి నైపుణ్య పరీక్షలు

- 133 మందికి వృత్తి నైపుణ్య పరీక్షల నిర్వహణ
- 18 సంవత్సరాలు నిండినవారికి సభ్యత్వం



వృత్తినైపుణ్య శిక్షణలో పాల్గొన్న మత్స్యకారులు

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని కన్నాపూర్ ఊర చెరువులో సోమవారం మత్స్యకారులకు వృత్తి నైపుణ్యత పరీక్షలను జిల్లా మత్స్యశాఖ అధికారి వరదారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శెట్టిపల్లి సంగారెడ్డి గ్రామానికి చెందిన 75 మందికి, కన్నాపూర్ గ్రామానికి చెందిన 48 మందికి, అదేవిధంగా కొండాపూర్ 10 మందికి, మూడు గ్రామాలకు చెందిన 133మంది మత్స్యకారులకు వృత్తి నైపుణ్యత పరీక్షలు నిర్వహించారు. పరీక్షల్లో భాగంగా వల విసురుడు, ఈత కొట్టడం, పాండి గుంజుడు, తదితర పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్టర్ శ్రీనివాస్, ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షులు బట్టు విట్టల్, తెలంగాణ ముదిరాజ్ మహాసభ లింగంపేట్ మండల అధ్యక్షుడు సాయికుమార్, ఎంపీటీసీలు ఇందిరా సాయి కిరణ్, వెంకటి, కన్నాపూర్ సర్పంచ్ గోవింద్, మత్స్య సహకార సంఘం అధ్యక్షులు అక్కం సాయిలు, పాపయ్య, రమేష్, కాశిరాం, మనోజ్, మత్స్య శాఖ సిబ్బంది సురేష్, శ్వేత, నరేష్, మూడు గ్రామాల మత్స్య సహకార సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 12 శనగ కొనుగోలు కేంద్రాలు

- మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి

నవతెలంగాణ-రెంజల్

రాష్ట్ర ప్రభుత్వం రైతుల పక్షపాతి అని, రైతులకు నష్టం జరగకుండా జిల్లాలో 12 శనగ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్టు మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి స్పష్టం చేశారు. సోమవారం మండలంలోని నీలా సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శనగ కొనుగోలు కేంద్రాన్ని జిల్లాలోనే మొదటగా ప్రారంభించామని ఆయన పేర్కొన్నారు. రైతులు పండించిన పంటను దళారులు తక్కువ ధరకే కొనుగోలు చేస్తుండడంతో మార్క్‌ఫెడ్ ద్వారా రూ.5,337 మద్దతు ధరను ప్రకటించి శనగ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. కొనుగోలు చేసిన 15 రోజులలోపు రైతు ఖాతాల్లో డబ్బులను జమ చేయనున్నట్టు వివరించారు. రబీ సీజన్లో వరి పంటకు మరో దఫా యూరియా అవసరం కావడంతో సొసైటీల ద్వారా యూరియాను సరఫరా చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షులు, దూపల్లి సింగిల్ విండో చైర్మన్ శేషుగారి భూమారెడ్డి ఆయన దృష్టికి తీసుకురాగా, యూరియా కొరత లేదని సాధ్యమైనంత మట్టుకు సొసైటీలకు సరఫరా చేస్తామని ఆయన పేర్కొన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార్క్‌ఫెడ్ చైర్మన్

సొసైటీల ద్వారా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి దళారుల నుంచి రైతులను కాపాడగలిగే అవకాశముందని ఆయన పేర్కొన్నారు. రైతుల పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఆయన స్పష్టం చేశారు.

కార్యక్రమంలో నీల సింగిల్ విండో చైర్మన్ ఇమామ్ బేగ్, రెంజల్ సింగిల్ విండో చైర్మన్ మొయినుద్దిన్, నీల సింగిల్ విండో వైస్ చైర్మన్ సలీం బేగ్, సర్పంచులు మీర్జా కలీం బేగ్, రమేష్ కుమార్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రఫీక్, కందకుర్తి ఎంపీటీసీ అసద్‌బేగ్, కందకుర్తి గ్రామ కమిటీ అధ్యక్షులు మోసిన్ బేగ్, డైరెక్టర్లు ఆకాష్, సాయిలు, స్థానికన్ నాయకులు రాఘవేందర్, ఫారుక్ పటేల్, అక్తెర్, వ్యవసాయాధికారి లక్ష్మీకాంత్ రెడ్డి, రామచందర్, తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రభుత్వాసుపత్రిని, అంగన్వాడీ కేంద్రాలను సందర్శించనున్న రాష్ట్ర బృందం సభ్యులు



నవతెలంగాణ-భిక్కనూర్

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రితో పాటు మండల కేంద్రంలో ఉన్న అంగన్వాడీ కేంద్రాలను ముఖ్యమంత్రి కార్యాలయ అదనపు కార్యదర్శి స్మిత సబర్వాల్, రాష్ట్ర ఆరోగ్యశాఖ కార్యదర్శి మహంతితో పాటు జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మంగళవారం సందర్శించనున్నారని జిల్లా ఉప వైద్యాధికారి శోభారాణి తెలిపారు. సోమవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. మొదటగా రాష్ట్ర బృంద సభ్యులు గర్భిణీలకు అందజేస్తున్న న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేస్తారని, అనంతరం ఆస్పత్రిలో మందులతోపాటు కేసీఆర్ కిట్టులకు సంబంధించిన వివరాలను తెలుసుకుంటారన్నారు. అనంతరం మండల కేంద్రంలో అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి అక్కడ రికార్డులను తనిఖీ చేస్తారని అనంతరం కామారెడ్డికి వెళ్తారని ఆమె వివరించారు.

సీసీ రోడ్ల మంజూరులో వివక్ష ఎందుకు ?

- కెలూరు సర్పంచ్ నీలావతి హనుమాన్లు

నవతెలంగాణ-మద్నూర్

మండలంలోని కేలూర్ గ్రామపంచాయతీకి గత రెండు సంవత్సరాల కాలంగా ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధుల ద్వారా రావలసిన నిధులు తమ గ్రామ పంచాయతీకి ఎందుకు రావడం లేదని సర్పంచ్ నీలావతి హనుమాన్లు ప్రశ్నించారు. వార్డు సభ్యులతో కలిసి సోమవారం ఎంపీడీవోకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ... ఎన్ఆర్ఈజీఎస్ నిధుల ద్వారా వచ్చే సీసీ రోడ్ల మంజూరు గత రెండు సంవత్సరాల నుంచి



వినతిపత్రాన్ని అందజేస్తున్న సర్పంచ్

మా గ్రామానికి మంజూరు చేయకుండా వివక్ష చూపుతున్నారని తెలిపారు. ఉమ్మడి మండలంలోనే మా పంచాయతీలో లేబర్ వర్క్ ఎక్కువగా జరుగుతుందని, ఐతే మెటీరియల్ పేమెంట్ కింద రావలిసిన 40శాతం నిధులను దారి మళ్లీస్తూ మా గ్రామాన్ని అభివృద్ధి చెందకుండా చేస్తున్నారని తెలిపారు. మా గ్రామానికి రావాల్సిన సీసీ రోడ్డు మంజూరును తక్షణమే మంజూరు చెయ్యాలని ఎంపీడీవోను కోరారు. సర్పంచ్, వార్డు సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్‌లో ఘనంగా బోనాలు



బోనాల ఊరేగింపులో మహిళలు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో బోనాల పండుగను సోమవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో శ్రీఉమసంగమేశ్వర ఆలయ సందర్భంగా మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని గ్రామంలో ముత్యాల పోచమ్మ, నల్ల పోచమ్మ, ఎల్లమ్మలకు బోనాలు నిర్వహించారు. మొదటి రోజు ఉమాసంగమేశ్వర స్వామి విగ్రహపల్లకి నిర్వహించి, రెండోవ రోజు గ్రామంలో ఎడ్ల బండ్ల ప్రదర్శనలు, మూడోవ రోజు గ్రామంలో బోనాలు నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని నెత్తిన బోనాలు ఎత్తుకొని డబ్బు చప్పుళ్ల మధ్య ఆలయం వద్దకు చేరుకున్నారు. సర్పంచ్ మామిడి దామోదర్, ఉపసర్పంచ్ గోపాల్, మాజీ సర్పంచ్ అరవింద్, శ్రీనివాస్‌గౌడ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అల్లు అర్జున్ ఆర్మీ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

కొక్కొండ గ్రామంలో అల్లు అర్జున్ ఆర్మీ ఆధ్వర్యంలో మండల లీడ్ చింతకాయల రాజు అల్లు అర్జున్ పుట్టినరోజు సందర్భంగా 50 రోజుల ముందుగానే 50రోజులు, 100 కార్యక్రమాలు, 100 స్థానాలలో భాగంగా స్కూల్ పిల్లలకు పెన్నులు, పుస్తకాలు, జామెట్రీ బాక్సులను సోమవారం పంపిణీ చేశారు. అల్లు అర్జున్ ఆర్మీ ద్వారా ఈ సేవ కార్యక్రమాలు చేయడం చాలా సంతోషంగా ఉందని చింతకాయల రాజు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ జీవన్‌గౌడ్, అల్లు అర్జున్ ఆర్మీ సైనికులు కమ్మరి ప్రవీణ్, చాకలి ప్రణీత్, బోయిని శివకుమార్, కుమ్మరి విజయ్, బచ్చ బోయిన గణేష్, పాఠశాల ఉపాధ్యాయులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణాన్ని పరిశీలించిన మున్సిపల్ చైర్మన్ సత్యం

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

మండలంలోని పోచారం ప్రధాన కాలువ గండి మాసంపేట్ గ్రామంలో ఇరిగేషన్ నిధులతో నిర్మిస్తున్న బ్రిడ్జి పనులను ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, జెడ్పీటీసీ ఉషాగౌడ్, ఇరిగేషన్ డీఈ వెంకటేశ్వర్లు పనులను సోమవారం పరిశీలించారు. గ్రామంలో గత కొన్ని సంవత్సరాలుగా నూతన బ్రిడ్జి నిర్మించాలని గ్రామస్తులు కోరడంతో స్థానిక ఎమ్మెల్యే జాజాల సురేందర్ ప్రత్యేక నిధులు తెచ్చి ఇరిగేషన్ ద్వారా పనులు నిర్వహిస్తున్నారని, సుమారు 62 లక్షలతో నిర్మిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రాము, బీఆర్ఎస్ నాయకులు శ్రవణ్ కుమార్ రాజు, జగన్‌గౌడ్, అరవింద్‌గౌడ్, సాయి రాములు తదితరులు పాల్గొన్నారు.

22న మండల సాధారణ సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

ఈనెల 22న కమ్మర్‌పల్లి మండల సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షురాలు గౌతమి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సంతోష్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు సాధారణ సర్వసభ్య సమావేశం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. సమావేశానికి మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు సకాలంలో హాజరుకావాలని సూచించారు. మండల స్థాయి అధికారులు తమ తమ శాఖలకు సంబంధించిన అభివృద్ధి నివేదికలతో పాటు, పూర్తిస్థాయి సమాచారంతో సమావేశానికి హాజరు కావాలని తెలిపారు.

నీటిని తొలగిస్తాం



నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని పెర్కిట్ శ్రీనివాస నగర్ కుక్కల గుట్ట 23 వార్డ్‌లో మురికి కాలువలు నిర్మించండిఅని ఈనెల 13న ప్రచురితమైన వార్తకు మున్సిపల్ అధికారులు స్పందించారు.. ఈ సందర్భంగా సోమవారం మున్సిపల్ కమిషనర్ మనోహర్, డీఈ భూమేశ్వర్, సానిటరీ ఇన్‌సెక్టర్ మహేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పైపులైన్ వేసి మురికి నీటిని తొలగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు జంగం అశోక్, కాలనీవాసులు ప్రభాకర్, రాజేష్, అరుణ్ కుమార్, ముత్యాల నర్సయ్య, రాజేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో తాగునీటి ఇబ్బందులు ఉండొద్దు

- **జడ్పీచైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు**

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

రాబోవు వేసవిలోత్రాగు నీటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, నాణ్యమైన భోజనాన్ని మెనూ ప్రకారం అందించాలని జెడ్పీ చైర్మన్ దాదన్న గారి విఠల్ రావు అన్నారు. సోమవారం జెడ్పీ కార్యాలయం లో నిర్వహించిన స్థాయి సంఘం సాంఘీక సంక్షేమం సమావేశంలో దాసరి ఇందిర అధ్యక్షతన, ఎక్స్ ఆఫీసియోగా జెడ్పీ చైర్మన్ దాదన్న గారి విఠల్ రావు హాజరై సమావేశాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ హాస్టల్లో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని తెలిపారు. నాణ్యమైన భోజనాన్ని మెనూ ప్రకారం అందించాలని, రాబోవు వేసవిలో తాగు నీటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అన్నారు. మంజూరైన రుణాలు అన్ని గ్రౌండ్ అయ్యే విధంగా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. 15 వ ఆర్థిక సంఘం 2023-24 సంవత్సరానికి సంబందించి ప్రణాళికలు తయారు చేయాల్సి ఉన్నందున జడ్పీటీసీ నిబంధనలకు లోబడి ప్రతిపాదనలు జెడ్పి కార్యాలయానికి పంపాలని కోరారు. సమావేశంలో ఇంజనీరింగ్ శాఖల పనుల ప్రగతి పై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు, మంజూరైన పనులు నాన్యతతో సరైన సమయంలో పూర్తిచేయాలని అన్నారు. జడ్పీ నుండి మంజూరైన 15వ ఆర్థిక సంఘం, ఎసైఎఫ్సి నిధులకు సంబంధించిన పనులు మార్చి 31లోగా పూర్తి చేసే విధంగా పంచాయతీ రాజ్, గ్రామీణ నీటి సరఫరా ఇంజినీరింగ్ శాఖ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీఈఓ గోవింద్, పంచాయతీ రాజ్ శాఖ ఎస్ఈ ప్రభాకర్, ఆర్మూర్ ఈఈ. మురళి, డిప్టీ ఈఈ శంకర్, గ్రామీణ నీటి సరఫరా శాఖ డిప్టీ ఈఈలు రాఘవేందర్, గంగారం, జెడ్పిటీసీ సభ్యులు మ్యాక విజయ రెంజల్, అంబర్ సింగ్ చందూర్, ముప్కాల్ నర్సవ్వ, మోస్ర విజయభాస్కర్ రెడ్డి, భీంగల్ రవి, ఆర్మూర్ మెట్టు సంతోష్, నవీపేట్ సవిత, బీసీ, యస్సి, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మెన్ విఠల్‌రావు

కంపోస్టు షెడ్లను వినియోగంలోకి తేవాలి

- **డీఎల్పీఓ శ్రీనివాస్**

నవతెలంగాణ-పిట్లం

కంపోస్టు షెడ్లను వినియోగంలోకి తేవాలని డివిజనల్ పంచాయతీ అధికారి శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండలంలోని అన్నారం గ్రామపంచాయతీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల అవసరాల నిమిత్తం నిర్మించిన కంపోస్ట్ షెడ్డులను వినియోగిస్తూ తడి పొడి చెత్తల వల్ల పంచాయతీలకు ఆదాయాన్ని సమకూర్చాలని సూచించారు. మండల పంచాయతీలు నెలాఖరు వరకు నూటికి నూరు శాతం పన్నులను వసూలు చేయాలని, రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీఓ బ్రహ్మం, సెక్రటరీ రాజు, సిబ్బంది బాలు తదితరులు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న డీఎల్పీఓ

కంటి వెలుగుతో ప్రయోజనాలు

- **ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రాజ్ కుమార్**

నవతెలంగాణ-ఎడపల్లి

కంటి వెలుగుతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని గ్రామీణ ప్రాంత ప్రజలు కంటి వెలుగు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎడపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఇంచార్జ్ వైద్యాధికారి రాజ్ కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని నెహ్రూనగర్, ఎడపల్లి గ్రామాలలో కంటి వెలుగు శిబిరం నిర్వహించారు. అవసరం ఉన్న వారికి వెంటనే అద్దాలు పంపిణీ చేస్తున్నట్టు ఆయన తెలిపారు. అలాగే మండల పరిషత్ అభివృద్ధి అధికారి గోపాలకృష్ణ కంటి వెలుగు శిబిరాన్ని పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఎడపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏఎన్‌ఎం సరిత, గంగామణి, ఆశావర్కర్లు రాజమణి, కంటి వెలుగు వైద్య నిపుణులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మ తల్లి గుడి నిర్మాణానికి విరాళం అందజేత

నవతెలంగాణ-ఎడపల్లి

మండల పరిధిలోగల బతుకమ్మ చెరువు సమీపాన ఎడపల్లి ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న పెద్దమ్మ గుడి ఆలయానికి ఎడపల్లి గ్రామానికి చెందిన కందగట్ల రామచందర్ సోమవారం రూ. 10,116 నగదును ముదిరాజ్ సంఘ పెద్దలకు విరాళంగా అందజేశారు.

విప్ సహకారంతో గ్రామాలాభివృద్ధి

నవతెలంగాణ-భిక్కనూర్

రాష్ట్ర ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ సహకారంతో గ్రామాలను అభివృద్ధి చేస్తామని ఎంపీపీ గాల్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని అయ్యవారిపల్లి, రామేశ్వర్‌పల్లి, ర్యాగట్లపల్లి గ్రామాలలో 30 లక్షల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధుల కింద మూడు గ్రామాలకు 10 లక్షల రూపాయలు చొప్పున మంజూరైన నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచులు లక్ష్మి, నాగర్తి పోతిరెడ్డి, అనసూయ, ఆత్మ కమిటీ చైర్మన్ నర్సింహారెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ హనుమంత్‌రెడ్డి, పెద్ద మల్లారెడ్డి సొసైటీ చైర్మన్ బాలగోని రాజాగౌడ్, ఎంపీటీసీ మద్ది చంద్రకాంత్‌రెడ్డి, కోడూరి సాయగౌడ్, రామేశ్వర్‌పల్లి సొసైటీ చైర్మన్ భూమిరెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ ఎడ్ల రాజిరెడ్డి, రైతుబంధు మండల కన్వీనర్ రామచంద్రం, భిక్కనూర్ మాజీ సర్పంచ్ నాగభూషణంగౌడ్, ఆయా గ్రామాల బీఆర్‌ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, పార్టీ అధ్యక్షులు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

సుంకిని ఎంపీటీసీపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-కోటగిరి

సుంకిని ఎంపీటీసీపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కోటగిరి ఉమ్మడి మండలంలోని విలేకరులు పోతంగల్ తహసీల్దార్ రమేష్‌కు, పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సుంకిని ఎంపీటీసీ అక్రమంగా ఇసుక తరలిస్తున్న విషయం పోలీసులకు తెలపడంతో, దానిని మనసులో పెట్టుకొని ఎంపీటీసీ విలేకరులపై ఫోన్‌లో దుర్భాషలాడారని తెలిపారు. కావున ఎంపీటీసీపై చర్యలు తీసుకోవాలని కోరారు.

కొడుకును హత్య చేసిన తండ్రికి జీవితఖైదు

నవతెలంగాణ-నిజామాబాద్

పది నెలల కుమారుడిని హత్య చేసిన తండ్రికి జీవిత కారాగార శిక్ష విధిస్తు నిజామాబాద్ సెషన్స్ జడ్జి సునీత కుంచాల సోమవారం తీర్పు వెలువరించారు. నిజామాబాద్ నగర మూడవ టౌన్ పోలీసులు కోర్టుకు సమర్పించిన అభియోగాల ప్రకారం సాక్షుల వాంగ్మూలాలు నమోదు చేసిన సెషన్స్ కోర్టు పై విధంగా తీర్పునిచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. నగరంలోని దుబ్బ ఎస్.ఆర్.టి క్వార్టర్స్ చెందిన కతుల్వార్ కృష్ణవేణి, బాలాజీ భార్యాభర్తలు. వీరికి పది నెలల కుమారుడు ప్రశాంత్ ఉన్నాడు. ప్రతిరోజు మద్యం తాగి భార్యతో గొడవ పడుతూ వివాహేతర సంబంధాలు అంటగడుతూ వేధించేవాడు. ఈ క్రమంలో 2014 ఆగస్టు 7వ తేదీనా రాత్రి పదకొండు గంటలకు భార్యతో గొడవపెట్టుకుని భార్యపై కోపంతో పదినెలల కొడుకును నేలకేసి కొట్టడంతో గాయాలపాలైన కుమారున్ని తల్లి నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య చికిత్స కై చేర్పించింది. వైద్యుల సూచన మేరకు హైదరాబాద్ కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. హత్య నేరారోపణ రుజువు కావడంతో ముద్దాయి మారుతి కి జీవిత ఖైదు తో పాటు రెండువేల రూపాయల జరిమానా విదిస్తూ సెషన్స్ జడ్జి సునీత తీర్పు చెప్పారు. పోలీసుల తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ రవిరాజ్ ప్రాసిక్యూషన్ నిర్వహించారు.

హార్వెస్టర్ ఢీకొని ఒకరి మృతి

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

హార్వెస్టర్ ఢీకొని ఒకరు మృతి చెందారు. ఎస్సై శ్రీకాంత్ కథనం ప్రకారం... ఇందల్వాయి మండలం ఇందల్‌వాయి తండాకు చెందిన బదావత్ ప్రేమ్ దాస్ పోచంపాడు నుండి ద్విచక్ర వాహనంపై తండాకు వెళ్తున్నాడు. అర్గుల్ జాతీయ రహదారి యూటర్న్ వద్దకు రాగానే జక్రాన్‌పల్లి వైపు నుంచి ఎదురుగా హార్వెస్టర్ వచ్చి ఢీకొంది. బదావత్ ప్రేమ్ దాస్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి మృతదేహాన్ని తరలించామని అన్నారు. ఇంతవరకు ఫిర్యాదు అందలేదని ఎస్ఐ తెలిపారు.

పట్టపగలే తాళం వేసిన ఇంట్లో చోరీ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మండలంలోని ధర్మారం బి గ్రామంలో తాళం వేసి ఉన్న ఇంట్లో పట్టపగల జొరబడి బీరువాలో ఉన్న బంగారం ఎత్తుకెళ్లారు. బాధితుల వివరాల ప్రకారం... ప్రభుత్వ పాఠశాలలో అధ్యాపకురాలైన లక్ష్మి విధులు నిర్వహించుకుని సోమవారం సాయంత్రం తిరిగి ఇంటికి వచ్చేసరికి తలుపులకు వేసిన తాళం పగలగొట్టి ఉండడం గమనించారు. లోపలికి వెళ్లి పరిశీలించగా బీరువాను ధ్వంసం చేసి ఉండడం, దానిలో దాచి ఉంచిన ఆరు తులాల బంగారం, నగదు దొంగలించుకుని పోయినట్లు గుర్తించారు. విషయం తెలుసుకున్న ఎస్సై కచ్చుకాయల గణేష్ ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఈ విషయమై నవతెలంగాణ ఎస్సైని వివరణ కోరగా ఇప్పటివరకు ఏలాంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు.

పట్టణంలో దోపిడి దొంగల బీభత్సం

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని ఆర్కే కాంప్లెక్స్ లో ఆదివారం రాత్రి గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డట్టు దుకాణ యజమానులు సోమవారం తెలిపారు ఈ కాంప్లెక్స్ లోని రెండు షట్టర్ల తాళాలు పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. సాయి కృప ఆన్లైన్ సర్వీస్ సెంటర్, సాయి మీసేవ సెంటర్లలో చొరబడి రెండు షాపుల నుండి 7000 చోరీకి గురైనట్లు బాధితులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాము తెలిపారు.

గంజాయి పట్టివేత

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాదు ఎక్సైజ్ స్టేషన్ అధికారులు బాబన్‌సహాబ్‌పహాడ్ వద్ద సోమవారం జరిపిన తనిఖీలో షైక్ హాజీ అనే వ్యక్తి అక్రమంగా 650 గ్రాముల గంజాయి తరలిస్తుండగా బైక్ తో సహా పట్టుకున్నారు. గంజాయి తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్ కి తరలించినట్లు ఎక్సైజ్ ఎస్హెచ్ఓ మధుసూదన్ రావు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ మల్లేష్, సిబ్బంది షబ్బీర్, ప్రభాకర్, సంగయ్య, రవి, మోహన్ సింగ్ పాల్గొన్నారు.

3,517 మందికి కంటి పరీక్షలు

- **కంటి వెలుగు-2 వైద్య సిబ్బందికి ఘన సన్మానం**

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రంలోని రైతు వేదికలో గత 23 రోజులుగా కంటి వెలుగు-2 కార్యక్రమంలో 3,517 మందికి కంటి పరీక్షలు నిర్వహించిన వైద్య సిబ్బందికి సర్పంచ్ ఎంఎస్ రమేష్‌కుమార్, టీఆర్ఎస్ సీనియర్ నాయకులు రఫీక్ ఆధ్వర్యంలో చివరి రోజైన సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ వినయ్ కుమార్ మాట్లాడుతూ.. దగ్గర చూపు కలిగిన రీడింగ్ గ్లాసులను 556 మందికి పంపిణీ చేశామని, దూరం చూపు కలిగిన 123 మందికి గాను 17 మందికి మాత్రమే పంపిణీ చేశామని తెలిపారు. మిగతా వారికి త్వరలోనే పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. 103 మందికి మోతిబిందు, ఇతర సమస్యలు కలిగిన వారిని గుర్తించి వారందరిని జిల్లా ఆస్పత్రికి తరలించడానికి పేర్లు నమోదు చేసినట్టు వివరించారు. కార్యక్రమంలో హెచ్ఈవోలు కరిపే రవీందర్, శ్రావణ్ కుమార్, సూపర్వైజర్ మాలంబి, ఆరోగ్య కార్యకర్తలు శాంతకుమారి, వసంత, కంటి వైద్య నిపుణులు ప్రవీణ్, ఇర్ఫాన్, ఆశావర్కర్లు సుజాత, కల్పన, స్వప్న, సరిత, అంగన్వాడీ కార్యకర్తలు, పంచాయతీ సిబ్బంది, ఐకేపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లైబ్రరీ సమయపాలన పెంచాలని వినతి

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలోని లైబ్రరీ సమయం పని వేళలు మార్చాలని కోరుతూ సోమవారం పాఠకులు బోధన్ ఆర్డీఓ రాజేశ్వర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రస్తుతం ఉద్యోగాలకై సన్నద్ధమవుతున్న నిరుద్యోగులు గ్రూప్స్ పరీక్షలకు, పోటీ పరీక్షలకు, సిద్ధమవుతున్నారని.. వారి సౌకర్యార్థం పనివేళలు మార్చాలని కోరారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న సందర్భంగా ఏకాగ్రతతో చదువుకోడానికి సరైన స్థలం లేని కారణంగా ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. కావున మిగతా పట్టణాలలో వలే గ్రంథాలయ వేళలను ఉదయం 8 నుంచి సాయంత్రం 7 గంటల వరకు తెరిచి ఉంచే విధంగా శాఖాపరంగా చర్యలు తీసుకోవాలని పాఠకులు కోరారు.

డ్వాక్రా మహిళలకు

వడ్డీ లేని రుణాలు మంజూరు చేయాలి

- **మహిళల ర్యాలీ, ధర్నా**

నవతెలంగాణ-బోధన్

ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన మాట ప్రకారం వడ్డీలేని రుణాలు, అభయహస్తం పథకం అమలు చేయాలని కోరుతూ సోమవారం బోధన్ పట్టణంలో మహిళలు మహాలక్ష్మి ఆలయం నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీగా తరలివచ్చి ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ప్రగతిశీల మహిళా సంఘం బోధన్ పట్టణ అధ్యక్షులు నాగమణి మాట్లాడుతూ.. మెప్మా ఐకేపీలలో పనిచేస్తున్న సిబ్బందికి వేతనాలను పెంచి క్రమం తప్పకుండా ఇవ్వాలని డిమాండ్ చేశారు. డ్వాక్రా మహిళలకు వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని, అభయహస్తం అమలు చేయాలని కోరారు. వైఎస్సార్ ప్రభుత్వం పావలా వడ్డీ రుణాలు ఇస్తే, టీఆర్ఎస్ ప్రభుత్వం పది లక్షల వరకు వడ్డీ లేని రుణాలు ఇస్తామని మేనిఫెస్టోలో ప్రకటించిందని, కానీ కేసీఆర్ మాట నీళ్ల మూటలాగా మారిందని అన్నారు. మాట తప్పను మడమ తిప్పను అన్న కేసీఆర్ అధికారంలోకి రాగానే మహిళలకు మొండి చేయి చూపిస్తున్నారని విమర్శించారు. మహిళలు తమ కష్టార్జితంతో పొదుపు చేసి బ్యాంకుల్లో జమ చేసి, రుణాలు తీసుకొని వాటికి ప్రతి నెల వడ్డీ చెల్లిస్తున్నారని కేసీఆర్ ప్రభుత్వం మాత్రం వడ్డీ డబ్బులు ఇవ్వకుండా నిర్లక్ష్య వైఖరిని అనుసరిస్తుందని మండిపడ్డారు. ప్రభుత్వం డ్వాక్రా, స్త్రీ నిధి మహిళలకు వర్తించే స్కీములు అమలు చేయక పోవడంతో మహిళలు ఇబ్బందుల పాలవుతున్నారని తెలిపారు. అదేవిధంగా మెప్మా, ఐకేపీలలో పనిచేస్తున్న సిబ్బంది వేతనాలను పెంచి క్రమం తప్పకుండా ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనియెడల భవిష్యత్తులో పెద్ద ఎత్తున మహిళలతోని ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పీఓడబ్ల్యూ జిల్లా నాయకురాలు బిపాషా బేగం, యాదమ్మ, పి.పద్మ, సూర్యకళ, ఎల్.గంగామని, అనిత, పోషవ్వ, గంగవ్వ, లసుంబాయి మహిళలు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న మహిళా సంఘాల సభ్యులు

కత్తిపోట్ల కేసును ఛేదించిన పోలీసులు

- **ఇద్దరి అరెస్ట్..**
  కత్తి, మోటార్ సైకిల్ స్వాధీనం
- **కొడుకును చంపారనే కోపంతో ఐదుగురిని చంపేందుకు స్కెచ్..!**

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగరంలో ఈనెల 16న పట్టపగలు మూడవ పోలీస్ స్టేషన్ పరిధిలో యువకుడిపై కత్తిపోట్ల ఘటనలో ఇద్దరిని అరెస్టు చేసినట్టు నిజామాబాద్ ఏసీపీ కిరణ్ కుమార్ తెలిపారు. సోమవారం నిజామాబాద్ అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఏసీపీ వెల్లడించారు. ఈనెల 19న హమాల్వాడిలో చాట్ల గోపి అలియాస్ షాపురం గోపి, మానే ప్రకాష్‌ను అదుపులోకి తీసుకొని విచారించామన్నారు. ఈ నెల 16న నిజామాబాద్ సుబాషనగర్ నిర్మల హృదయ చౌరస్తా వద్ద మానే శివ కుమార్‌ను నగరంలోని మిర్చి కాంపౌండ్‌కు చెందిన షాపురం గోపి అలియాస్ చాట్ల గోపి, మేడ్చల్ జిల్లాకు చెందిన మన్నే ప్రకాష్ శివను చంపాలనే ఉద్దేశంతో కత్తితో పొడిచారని తెలిపారు. శివకుమార్ తప్పించుకుని ప్రాణాలు కాపాడుకున్నా అన్నారు. బాధితుని ఫిర్యాదు మేరకు మూడవ టౌన్ ఎస్సై జి. శ్రావణ్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆదివారం హమాల్వాడిలో ఏ1 - షాపురం గోపి అలియాస్ చాట్ల గోపి, ఏ 2 మానే ప్రకాష్‌ను అదుపులోకి తీసుకొని విచారించారు. వారు నేరాన్ని ఒప్పుకున్నారని తెలిపారు. చాట్ల గోపి కుమారుడైన చాట్ల శివను జనవరిలో మానే శివకుమార్ మరో నలుగురితో కలిసి బోధన్ మర్డర్ చేయగా ఈఘటనకు పాల్పడిన ఐదుగురిని ఎలాగైనా చంపాలనే ఉద్దేశంతో గోపి ఆయన స్నేహితుడైన ప్రకాష్ సహాయంతో వారిలో ఒకరైన మానే శివ కుమార్‌ను ఈ నెల 16న చంపడానికి ప్రయత్నించాడన్నారు. ఈ కేసులో నిందితులు నేరాన్ని ఒప్పుకోగా చంపడానికి ఉపయోగించిన కత్తి, ఒక మోటార్ సైకిల్‌ను వారి నుంచి స్వాధీన పరుచుకొని ఇద్దరు నేరస్తులను రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. షాపురం గోపి అలియాస్ చాట్ల గోపిపై 16 దొంగతనాలు, ఒక దాడి కేసు, ఒక మర్డర్ కేసు ఉన్నాయని తెలిపారు. ప్రకాష్‌పై ఆరు కేసులు ఉన్నాయని ఏసీపీ తెలిపారు. సమావేశంలో నగర సీఐ వెంకటరమణ మూడో పోలీస్ స్టేషన్ ఎస్ఐ శ్రావణ్ కుమార్, ఏఎస్సై రామకృష్ణ, హెడ్ కానిస్టేబుల్ రాములు, కానిస్టేబుల్ ఎం డి ఆఫ్సార్, వెంకట్రాములను నిజామాబాద్ ఏసీపి కిరణ్ కుమార్ కేసును చేదించినందుకు అభినందించారు.

ఎమ్మెల్యేకు చిత్తశుద్ధి ఉంటే

డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు నిర్మించాలి

- **ఎల్లారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి**

నవతెలంగాణ-గాంధారి



ఎమ్మెల్యేకు చిత్తశుద్ధి ఉంటే డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని ఎల్లారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని వివిధ గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో హత్ సే హత్ జోడో యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో గడపగడపకూ తిరుగుతూ టీఆర్ఎస్, బీజేపీ ప్రభుత్వాలు చేస్తున్న మోసాలను ప్రజలకు వివరిస్తూ వారి సమస్యలను తెలుసుకుంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వారికిహామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే అసెంబ్లీ ఎన్నికలలో ఎల్లారెడ్డి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేయడం లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో గాంధారి కాంగ్రెస్ మండల నాయకులు కామెల్లి బాల్‌రాజ్, మోహన్ నాయక్, లైని రమేశ్, ఎమ్‌డీ మదార్, సంగెం రాజు, జస్వంత్ గౌడ్, రవి, సంతోష్, బిక్య, రమేశ్, భాస్కర్, రాజు, శివరాజ్, రాము, శ్రావణ్, పీర్యా, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

22న జాబ్ మేళా

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

రిలయన్స్ నిప్పన్ లైఫ్ ఇన్సూరెన్స్‌లో నిజామాబాద్ జిల్లా పరిధిలో లైఫ్ ప్లానింగ్ ఆఫీసర్ ఉద్యోగాల భర్తీ కోసం ఈ నెల 22న జాబ్ మేళా నిర్వహించనున్నట్టు జిల్లా ఉపాధి అధికారి సిరిమల్ల శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ ఉత్తీర్ణులై 30 ఏండ్ల వయస్సు దాటిన వారు కేవలం యువతులే అర్హులని, జాబ్ మేళాలో పాల్గొనే వారు 22న ఉదయం 10 గంటలకు శివాజీనగర్‌లోని ఉపాధి కార్యాలయానికి రావాలని సూచించారు. ఇతరాత్ర వివరాలకు 9581768413, 9959456793 నెంబర్‌లను సంప్రదించాలని సూచించారు.

13 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ పోలీస్ కమిషనర్ నాగరాజు ఆదేశాల మేరకు ఆదివారం నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించగా మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 13 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదైనట్లు ట్రాఫిక్ సీఐ చందర్ రాథోడ్ తెలిపారు. పట్టుబడినవారితోకలిపి 22 మందికి సోమవారం నగరంలోని జిల్లా టిటిఐ కౌన్సిలింగ్ సెంటర్లో కౌన్సెలింగ్ నిర్వహించారు.

ప్రజలపై ఏ మాత్రం చిత్తశుద్ధి లేదు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

సుందరీకరణపైన ఉన్న దృష్టి ప్రజలపైన ఏ మాత్రం చిత్తశుద్ధి లేదని కార్పొరేటర్ గడుగు రోహిత్ అన్నారు. నిజామాబాద్ నగరంలోని ఖలీల్ వాడి ప్రాంతంలో గల న్యూ అంబేద్కర్ భవన్లో నిర్వహించిన సమావేశంలో గడుగు రోహిత్ మాట్లాడుతూ.. ప్రజలకు ఉపయోగపడే పనులు చేయకుండా మున్సిపల్ శాఖ ఖర్చులోనే చూపిస్తుందని ఆరోపించారు. నగర సుందరీకరణ పేరుతో మేకప్ చేసినట్టు పనులు చేస్తున్నారు.. కానీ ప్రజలపైన ఏమాత్రం చిత్తశుద్ధి లేదని విమర్శించారు. స్లమ్ ఏరియాలో తాగునీరు, శానిటేషన్ పనులు చేయడం లేదని అన్నారు. మున్సిపల్ శాఖ ఏ ఒక్క వార్డుకు అఫీషియల్‌గా ఒక రూపాయి కేటాయించలేదని తెలిపారు.